శెట్టి శివకుమార్‌కు బసవరత్న అవార్డు

బసవరత్న అవార్డు అందుకుంటున్న శెట్టి శివకుమార్

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 20 : ఇబ్రహీంపట్నం మున్సిపల్‌కు చెందిన శెట్టి శివకుమార్‌కు రాష్ట్ర వీర శైవలింగాయత్ లింగబలిజసంఘం బసవరత్న అవార్డు వరించింది. రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ప్రస్తుతం సెంట్రల్‌కమిటీ సభ్యుడిగా నియామకం అయిన శెట్టి శివకుమార్‌కు శనివారం బసవరత్న అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెంట్రల్‌కమిటీ సభ్యులు శివరత్నం, గౌరవ అధ్యక్షులు ఈశ్వరప్ప, రాష్ట్ర అధ్యక్షులు సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శి దినేష్‌పాటిల్, రాష్ట్ర కోశాధికారి కల్లపల్లి రాచప్ప, ప్రధాన కార్యదర్శి సోమేశ్, శివశరణ్‌తో పాటు అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో వేడుకలు నిర్వహించాలి

వేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో స్వచ్ఛతీర్థ్

షాద్‌నగర్‌టౌన్, జనవరి 20: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించుకుందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య పిలుపునిచ్చారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని నిర్వహించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ప్రారంభోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గణితాన్ని సులభంగా నేర్చుకోవచ్చు

తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర కోశాధికారి పాండురంగయ్య

గణిత ప్రతిభా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 20: గణితంలోని మెళకువలు తెలుసుకోవడం ద్వారా గణితాన్ని సులభంగా నేర్చుకోవచ్చని తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర కోశాధికారి పాండురంగయ్య అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని గణిత ఫోరం మండలశాఖ ఆధ్వర్యంలో షాద్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీ జిల్లా పరిషత్ కుంట ఉన్నత పాఠశాలలో శనివారం మండలస్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో మెళకువలు తెలుసుకుంటే సులభంగా అర్థం చేసుకోవచ్చాన్నారు. విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభ వెలికి తీసేందుకు ఇలాంటి ప్రతిభా పరీక్షలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ ప్రతిభా పరీక్షలు మొత్తం 24మంది విద్యార్థులు పాల్గొనగా అందులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్యాంసుందర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమేశ్, వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, గణేశ్, శ్రీనివాస్, యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో టాలెంట్ టెస్టు

మొయినాబాద్ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం మండల స్థాయిలో గణిత టాలెంట్ టెస్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ టెస్ట్‌లో పెద్దమంగళారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సి.శివకుమార్‌కు మొదటి, పి.మల్లేశ్వరీకి రెండవ, కనకమామిడి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పి.పల్లవి తృతీయ స్థానంలో నిలువగా, వెంకటాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.కార్తిక్‌కు తృతీయ బహుమతి లభించింది. వెంకటాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.మహిత్రికి ప్రథమ బహుమతి నిక్షయ్ కుమార్‌కు తృతీయ బహుమతి, పెద్దమంగళారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బి.గౌతమికి ద్వితీయ బహుమతి, అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అనుప్రియకు తృతీయ బహుమతి లభించింది. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో 22వ తేదీన హయత్‌నగర్, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి రాష్ట్ర స్థాయిలో 29వ తేదీన నిజామాబాద్‌లోని తెలంగాణ యూనివర్సిటీలో గణిత టాలెంట్ పరీక్ష నిర్వహించనున్నారు.

పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌టౌన్, జనవరి 20 : గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండలం భైరంపల్లి నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకుసాగుతున్నామన్నారు. ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, జనవరి 20 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని చందనవెల్లి గ్రామంలో హనుమాన్ జయంతిలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు శ్రీరాముడి విగ్రహ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ...ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. అనంతరం దేవాలయం వద్ద సర్పంచ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొలన్ ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రమీల, గ్రామస్తులు వెంకటేశ్, రాఘవాచారి, విష్ణు, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశ్, వెంకటయ్య, యాదయ్య పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

షాబాద్, జనవరి 20 : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నగరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. షాబాద్ మండలానికి చెందిన వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నగరానికి తరలివెళ్లి నరేందర్‌రెడ్డికి బొకేలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

విద్యార్థులను అభినందించిన యాజమాన్యం

ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌కు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 20 : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తమిళనాడు రాజధాని చెన్నైలో నిర్వహిస్తున్న ఖేల్ ఇండియా యూత్ గేమ్స్‌కు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫర్‌గూడలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్బీస్టేడియంలో జరుగనున్న ఉమెన్ కిక్ బాక్సింగ్ లీగ్ పోటీల్లో తమ సత్తా చాటనున్నారని పాఠశాల యాజమాన్యం తెలిపారు. డీపీఎస్‌కు చెందిన పి.వన్షిక, టి.గ్రీష్మ, జి.జ్వాల, దర్శిని, జి.శ్రీజ, ఎస్.నీక్ష, పి.స్ఫూర్తి, స్వేచ్ఛారెడ్డి, ఐశ్వర్యలు ఎంపికైనట్లు వారు తెలిపారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

శంకర్‌పల్లి, జనవరి 20 : ఇంటర్ విద్యార్థి అదృశ్యమైన ఘటన శంకర్‌పల్లి మండలం ఏర్వగూడ గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాటిమీది వినయ్‌కుమార్(17) శంకర్‌పల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మూడురోజులుగా కళాశాలకు వెళ్లలేదని తెలియడంతో తండ్రి మందలించాడని తెలిపారు. తండ్రి మందలించగా గురువారం ఉదయం బయటకు వెళ్లిన కుమారుడు ఇంటికి తిరిగి రాలేదని పేర్కొన్నారు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వినయ్ ఆచూకీ లభిస్తే 76598 29385ను సంప్రదించాలని కోరారు.

వినయ్ (ఫైల్)

బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి

షాబాద్, జనవరి 20 : బడీడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని షాబాద్ ఎస్ఐ రాజేందర్ అన్నారు. శనివారం ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా షాబాద్ మండలంలోని చందనవెల్లిలోని కుందాన టెక్స్‌టైల్స్ కంపెనీలో లేబర్ క్యాంపులో ఉన్న 17మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కూలీల పిల్లలను గుర్తించి వెంటనే వారి తల్లిదండ్రులు, కంపెనీ సిబ్బందితో మాట్లాడి చందనవెల్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బడీడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సీఆర్పీ యాదయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాహేలీల, సిబ్బంది సంజీవ్ తదితరులున్నారు.

ఎయిడ్స్‌పై కళాజాత

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 20 : మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి సౌజన్యంతో సుంచు లింగయ్య పల్లె సద్దుల కళాబృందం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై పాటల రూపంలో అవగాహన కల్పించారు. శనివారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ఎచ్ఐవీ ఎయిడ్స్ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ అనిల్, వీఎస్ఎస్ఏఏ వన్ మైగ్రేట్‌వన్ సంస్థ సీఎం రాఘవ, కౌన్సిలర్ రేణుక, ఓఆర్‌డబ్ల్యూ కైలాస్ కళాబృందం లీడర్ లింగయ్య, సైదులు, శ్రీరామ్, ఆంజనేయులు, వాణి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

దుప్పట్లు, నోట్‌బుక్‌ల పంపిణీ

ఆమనగల్లు, జనవరి 20 : సర్వ్ దివ్యాంగుల సంస్థ దివ్యాంగులకు చేస్తున్న సేవలు అభినందనీయమని శెట్టిపల్లి సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి అన్నారు. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో సర్వ్ దివ్యాంగుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాసులు, దుప్పట్లు, కుట్టుమిషన్ మోటర్లు, దివ్యాంగ విద్యార్థులకు నోట్ బుక్‌లు పంపిణీ చేశారు. అదే విధంగా కామినేని దవాఖాన ఎల్‌బీనగర్ వారి సహకారంతో ఉచిత మెడికల్ హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గోదాదేవి ప్రారంభించారు. ఇందులో 120 మందికి బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు సత్యం, ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామ దివ్యాంగుల సంస్థ నాయకులు శెట్టిపల్లి రామచంద్రయ్య, సెర్వ్ దివ్యాంగుల సంస్థ డైరెక్టర్ డి. అనిల్‌కుమార్, సంస్థ సభ్యులు మీనాక్షి, శ్రీనివాస్, ధనలక్ష్మి, సురేశ్, ప్రమీల పాల్గొన్నారు.

మంచాల : ఆరుట్లలో ఓటరు నమోదు కరపత్రాలను విడుదల చేస్తున్న తహసీల్దార్ ప్రసాద్‌రావు

ఓటరు నమోదు కేంద్రాల పరిశీలన

మంచాల, జనవరి 20: 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మంచాల తహసీల్దార్ కేవీఈవీ ప్రసాద్‌రావు అన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఓటు హక్కు నమోదు కేంద్రాలను శనివారం తహసీల్దార్ కేవీవీ ప్రసాద్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌వోల వద్ద తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల బీఎల్‌వోలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

వార్డు ఆఫీసుల్లో ..

పెద్దఅంబర్‌పేట, జనవరి 20: మున్సిపాలిటీలోని వార్డు కార్యాలయంలో శనివారం ఓటరు నమోదు చేపట్టారు. పలువురు యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపారు. మరికొందరు ఓటును ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్పు చేసుకునేందుకు దరఖాస్తులు చేశారు. ఆయా వార్డు కార్యాలయాల్లో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

శంకర్‌పల్లి, జనవరి 20: విద్యార్థులు క్రీడల ఆడడం వల్ల శారీరక దారుఢ్యం పెరుగుతుందని అంకురా హోమ్స్ యాజమాన్యం, సామాజిక కార్యకర్తలు జైపాల్‌రెడ్డి, రవీకాంత్‌రెడ్డి, వెంకట్ అన్నారు. శనివారం మండలంలోని మోకిల గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో 13 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు ప్రైజ్‌మనీతో పాటు షీల్డ్‌లను అందించారు. మొదటి బహుమతి జనవాడ బాలుర ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.25 వేలు, ట్రోఫీలు, రెండవ బహుమతి కోండకల్ విద్యార్థులకు రూ.15వేలు, ట్రోఫీలను అందించారు. బాలికల విభాగంలో మొదటి బహుమతి ప్రొద్దటూర్ విద్యార్థినులకు రూ.25 వేలు, ట్రోఫీలు, రెండవ బహుమతి పర్వేద విద్యార్థినులకు రూ.15 వేల నగదు, ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రాజూనాయక్, అజయ్, శ్రీనివాస్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచాల, జనవరి 20 : మంచాల మండలం చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ, లింగంపల్లి, నోముల, జేనమ్మగూడ, మల్లికార్జునగూడ గ్రామాల్లో ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మంచాల ఏఈ సత్యనారాయణ శనివారం తెలిపారు. విద్యుత్ తీగల వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని దీనికి విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

అబ్దుల్లాపూర్‌మెట్‌లో కరెంట్ నిలిపివేత..

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 20 : విద్యుత్ మరమ్మతులు, చెట్ల తొలగింపు కారణంగా అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌స్టేషన్ పరిధిలోని తారామతిపేట, సద్దుపల్లి, వ్యవసాయ రైతులు, ఇండస్ట్రీస్‌లకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ విద్యారాణి తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బండరావిరాల, గువ్వలేటి, బాచారం, గృహ వ్యవసాయ, ఇడస్ట్రీస్ వినియోగ దారులకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అందుకు విద్యుత్ వినియోగ దారులు సహకరించాలని ఆమె కోరారు.

తెగుళ్లు సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

కమ్మెట గ్రామంలో పర్యటించిన వ్యవసాయ అధికారులు

చేవెళ్లరూరల్, జనవరి 20 : రైతులు పంటలకు తెగుళ్లు సోకకుండా పండించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి తులసి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని కమ్మెట గ్రామంలో వ్యవసాయ అధికారి తులసి శనివారం పర్యటించి పత్తి పంటలు పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో సాగులో అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఏవో వెంట దేవునిఎర్రవల్లి క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారి రమేశ్, రైతులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

తుర్కయాంజాల్, జనవరి 20 : వార్డు పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ కోశికె ఐలయ్య అన్నారు. శనివారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి కమ్మగూడ 22వ వార్డులో ప్రగతినగర్‌కాలనీ, నవభారత్‌కాలనీ, ప్రగతినగర్ కాలనీలలో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, బీటీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలోని ప్రతి కాలనీలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లేగ దూడలపై గుర్తు తెలియని జంతువు దాడి

ఒక దూడ మృతి, మరో మూడు దూడలకు గాయాలు

నందిగామ, జనవరి 20 : పశువుల పాకలో కట్టేసిన లేగ దూడలపై గుర్తు తెలియని జంతువు దాడి చేసిన ఘటన నందిగామ మండలం అంతిరెడ్డిగూడలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన ఎంబడి బాల్‌రాజ్ యాదవ్ శుక్రవారం రాత్రి తన పొలంలోని పశువుల పాకలో లేగ దూడలను కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని జంతువులు లేగ దూడలపై దాడి చేయడంతో ఒక లేడ దూడ మృతి చెందింది. వీటితో పాటు మూడు లేగ దూడలకు తీవ్ర గాయాలయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కొత్తూరు, జవనరి 20 : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడలో జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు కథనం ప్రకారం.. కుమ్మరిగూడకు చెందిన మైలారపు ఈశ్వరయ్య (45)గురువారం రాత్రి 9:30 గంటల తర్వాత చేపలు పట్టడానికి గోధుమకుంట చెరువుకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాతు చెరువులో పడి మృతి చెందాడు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహాయంతో వెతికినా ఈశ్వరయ్య ఆనవాళ్లు కనిపించలేదు. శనివారం ఉదయం ఈశ్వరయ్య మృతదేహం చెరువులో తేలుతూ కనిపించడంతో ఈ మేరకు పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈశ్వరయ్య తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తూరు ఎస్ఐ జి. శ్రీనివాసులు తెలిపారు.

ఇబ్రహీంపట్నం సీఐగా ఆంజనేయులు

ఇబ్రహీంపట్నం, జనవరి 20 : ఇబ్రహీంపట్నం సీఐగా ఆంజనేయులుగా శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇబ్రహీంపట్నం పోలీసుస్టేషన్‌లో సీఐగా పని చేసిన గోవింద్‌రెడ్డిని ప్రభుత్వం మేడిపల్లి సీఐగా బదిలీ చేయటంతో ఆయన స్థానంలో కల్వకుర్తి సీఐగా పనిచేసిన ఆంజనేయులును ఇబ్రహీంపట్నంకు బదిలీ చేసింది.

ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

మంచాల, జనవరి 20: ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నోటిఫికేషన్‌ను శనివారం మంచాల ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుగంధ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి విడుదల చేశారు. ఈ నెల 20నుంచి 21వరకు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 22నుంచి 23వరకు అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా విడుదల చేసి, 29న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు గీత, సాయికుమార్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలి

చేవెళ్లటౌన్, జనవరి 20: అయోధ్య రామ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఈ నెల 22వ తేదీన ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని చేవెళ్ల సర్పంచ్ బండారి శైలజ ఆగిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి ఇంటికీ పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.